

నిర్మల్ జిల్లాలో చెరువులో నీరు లేక సాగులోకి రాని కింది ఆయకట్టు



ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి చెరువులో మేస్తున్న పశువులు



నీళ్లులేక వెలవెలబోతున్న గెర్రె చెరువు

# బోసిపోతున్నయ్..

## కరుణించని వరుణుడు.. నిండని చెరువులు, కుంటలు

- జలాశయాలు వెలవెల.. ప్రశ్నార్థకంగా సాగు..
- తీవ్ర వర్షాభావంతో ఆందోళనలో అన్నదాతలు
- వరి సాగుకు వెనకడుగు వేస్తున్న రైతులు
- లోటు వర్షపాతంలో నాట్లు వేయని వైనం

కుమ్రం భీం ఆసిఫాబాద్/ఆదిలాబాద్/నిర్మల్, జూలై 16(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల్లో ఆందోళన మొదలైంది. వానకాలం సీజన్ ప్రారంభమై 40 రోజులు గడిచినా అనుకున్న స్థాయిలో వర్షాలు కురియలేదు. చెదురుమదురు చినుకులు మినహా పెద్ద వర్షం పడలేదు. దీంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి నీరు చేరలేదు. ఇప్పటివరకు నమోదైన వర్షపాతం వివరాలు వర్షాభావ తీవ్రతను వెల్లడిస్తున్నాయి. చెరువులు నిండకపోవడంతో వీటిపై ఆధారపడి పంటలు పండించుకునే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల అరకొరగా కురిసిన వర్షాల కారణంగా ఆరుతడి పంటలైన పత్తి, సోయా, మక్క, పప్పు దినుసుల పంటలను సాగు చేసిన రైతులు వరుణ దేవుడి కటాక్షం కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. యేటా ఈ సమయానికి జోరువానలతో కళకళలాడాల్సిన చెరువులు నీరు లేక బోసిపోతున్నాయి. ప్రభుత్వ పెద్దలు మాత్రం చిన్నపాటి వర్షాలనే భూతద్దంలో చూపుతూ అన్నదాతలంతా సంబరాల్లో మునిగితేలుతున్నారంటూ ప్రచారం చేస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. ప్రభుత్వం చెబుతున్న దానికి వాస్తవ పరిస్థితులకు పొంతన ఉండడం లేదు. మరో పక్షం రోజుల వరకు పరిస్థితి ఇలాగే ఉంటే వానకాలం సాగుపై రైతులు ఆశలు వదులుకోవాలని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

## నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ జిల్లావ్యాప్తంగా 734 చెరువులు ఉన్నాయి. వీటి కింద 71,832 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాలు అనుకున్న స్థాయిలో కురవక పోవడంతో కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులతోపాటు, సరస్వతీ కాలువ ద్వారా నిర్మల్ నియోజకవర్గానికి సాగు నీరందించే ఎస్సారెస్పీలోకి నేటికీ పెద్దగా నీరు చేరలేదు. ముథోల్ నియోజకవర్గంలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 1.852 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 0.676 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 13.48 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. గతేడాది ఇదే సమయానికి భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టు నీటిమట్టం 1069.30 అడుగులకు చేరి 22.05 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 4.237 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అలాగే స్వర్ణ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 1.484 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 0.168 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. ఆయా ప్రాజెక్టులు, చెరువులపైనే ఆధారపడి సాగు చేసుకుంటున్న అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో ప్రాజెక్టులు, చెరువుల కింద రైతులు వరి అధికంగా సాగు చేస్తుంటారు. ఈసారి దాదాపు లక్ష ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే మరో వారం పది రోజుల్లో భారీ వర్షాలు కురిస్తేనే చెరువుల్లోకి నీరు చేరే అవకాశం ఉన్నది. లేకుంటే ఈ సారి వరి సాగు చేసే రైతుల పరిస్థితి దయనీయంగా మారనున్నదంటున్నారు.



ఆశించిన వర్షాలు లేని కారణంగా నీరు చేరకపోవడంతో బోసిపోతున్న కడెం ప్రాజెక్టు

## ఆదిలాబాద్ జిల్లాలో..

ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా జైనథ్ మండలంలోని సాత్నాల, తాంసి మండలంలోని మత్తడి వాగుతోపాటు 452 చెరువులు ఉన్నాయి. వానకాలంలో 5.20 లక్షల ఎకరాల్లో పత్తి, సోయా, కంది, వరి ఇతర పంటలు సాగవుతాయి. యాసంగిలో 1.50 లక్షల ఎకరాల్లో శెనగ, జొన్న, గోధుమ పంటలు పండుతాయి. ఈ వానకాలంలో ఇప్పటివరకు భారీ వర్షాలు పడకపోవడంతో ప్రాజెక్టులు, చెరువుల్లోకి నీరు అంతగా చేరలేదు. భూగర్భ జలమట్టం కూడా పైకి రాలేదు. ఇప్పటివరకు సాధారణ వర్షపాతం నమోదైంది. మంగళవారం వరకు 353.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 391.6 మిల్లీ మీటర్ల వర్షం పడింది. నార్నూర్, ఇంద్రవెల్లి, మావల, బోథ్, నేరడిగొండ మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. గతేడాది ఈ సమయానికి భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండి పొంగి ప్రవహించాయి. ప్రాజెక్టులు కూడా పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయి. ఈ సీజన్‌లో మూడు వేల ఎకరాల్లో వరి వేసే అవకాశం ఉండగా.. నాట్లు వేయడానికి రైతులు పొలాలను సిద్ధం చేసినా వానలు లేకపోవడంతో నాట్లు వేయలేదు. గతేడాది ఈ సమయానికి నాట్లు వేసినట్లు రైతులు తెలిపారు.



నీరు లేక పిచ్చిమొక్కలతో నిండిన తాంసి చెరువు

## కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..

జిల్లాలో పత్తి తర్వాత అధికంగా వరి సాగవుతున్నది. ఈ యేడాది వరి 59,212 ఎకరాల్లో సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. కానీ.. వర్షాలు అనుకూలంగా లేకపోవడంతో తగ్గవచ్చని భావిస్తున్నారు. జిల్లాలోని ఎనిమిది మండలాల్లో లోటు వర్షపాతం నమోదవగా.. రెండు మండలాల్లో అధిక వర్షం కురిసింది. తిర్యాణి మండలంలో 29 శాతం, రెబ్బనలో 23, కాగజ్‌నగర్‌లో 28, పెంచికల్‌పేట్‌లో 26, ఆసిఫాబాద్‌లో 4, కౌటాలలో 19, బెజ్జూర్‌లో 9, దహెగాంలో 18, జైనూర్‌లో 14, సిర్పూర్(యు)లో 14, వాంకిడిలో 15, సిర్పూర్(టి)లో 2, చింతలమానేపల్లిలో 1 సాధారణ వర్షపాతం నమోదైంది. తిర్యాణి, రెబ్బెన, కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్ మండలాల్లో అత్యధికంగా లోటు వర్షపాతం నమోదైంది. ఒక్కపెద్ద వాన కూడా పడకపోవడంతో చెరువులు, కుంటల్లో నీరు చేరలేదు. చెదురుమదురు వర్షాలు మినహా సాగుకు సరిపడా వర్షం పడలేదు. బోర్ల కింద సాగు చేసే రైతులు వరి వేయడానికి ఆలోచిస్తున్నారు. కుమ్రం భీం ప్రాజెక్టు 10 టీఎంసీల సామర్థ్యం కాగా 5.9 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. ప్రాజెక్టులో సగానికి సగం నీరు తక్కువగా ఉండడంతో పంటలకు నీరు వదిలే పరిస్థితి లేదు. వట్టివాగు ప్రాజెక్టు సామర్థ్యం 2.890 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.219 టీఎంసీలు మాత్రమే నీరు ఉంది. దీంతో వరి సాగుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

### నీళ్లు లేక నాట్లు వేయలే..



యేటా వానకాలంలో ఈ సమయానికి మా ఊర చెరువు నీటితో కళకళలాడేది. వర్షాలు బాగా కురియడంతో నిండుకుండను తలపించేది. కానీ.. ఈ యేడాది వానలు అనుకున్న స్థాయిలో కురవలేదు. చెరువు కూడా నిండలేదు. వర్షాలు బాగా కురిసి చెరువులు నిండుతాయని.. భూములను సిద్ధం చేసుకున్నం. వర్షాలు కురియకపోవడంతో నాట్లు వేయలేదు. వర్షాలు ఎప్పుడు బాగా కురుస్తాయో.. ఎప్పుడు నాట్లు వేస్తామో అర్థం కావడం లేదు. ఈసారి పంట పోయినట్లే అని అనిపిస్తున్నది.

- మల్లేశ్, తంతోలి, ఆదిలాబాద్ రూరల్ మండలం



### పొలం బీడుగా ఉంది..

వర్షాలు లేక ఇంతవరకు నారుమళ్లు కూడా వేయలేదు. గతేడాది ఈ పాటికి నారు మళ్లు వేసి నాట్ల కోసం భూములను కూడా సిద్ధం చేసుకున్నాం. కానీ.. ఈ యేడాది వర్షాలు లేకపోవడంతో నారుమళ్లు కూడా వేయలేకపోయాం. నాకున్న ఐదెకరాల్లో బోరు ద్వారానే నీరు పారించుకుని పంట వేసేది. వర్షాలు లేక బోరు లో నీరు లేదు. వర్షాలు కురిస్తేనే బోరులో నీళ్లు వస్తాయి. ఇప్పటివరకు పెద్దవాన ఒక్కటి కూడా రాకపోయే సరికి ఇప్పటికీ నా పొలం బీడుగా ఉంది.

- దాదా భీమయ్య, రైతు, లగ్గాం, దహెగాం మండలం.

### చెరువులో బురద తప్ప.. నీరు లేదు..



దహెగాం, జూలై 16 : నాకు రెండెకరాల భూమి ఉంది. నా పొలానికి గెర్రె చెరువే జీవనాధారం. ఈ చెరువు నుంచే యేటా నీటిని పొలానికి పారించుకుంటా. ఈ యేడాది వర్షాలు లేకపోవడంతో చెరువులో బురద తప్ప నీళ్లు లేవు. వరి వేయడం కష్టమే అనిపిస్తున్నది. ఈసారి వర్షాల పరిస్థితి చూస్తే పంట పండే పరిస్థితి కనిపించడం లేదు. ఈ యేడాది పంటలు రావడం కష్టమే.

- తుమ్మిడి సత్తయ్య, దహెగాం మండలం.

### పెట్టుబడి చేతికొస్తదో.. రాదో..



తాంసి, జూలై 16 : గతేడాది జూలైలో చెరువులు, కుంటలు నిండుకుండలా ఉన్నాయి. ఈ సారి వర్షాలు కురియకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. 20 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్న కానీ.. మా బోర్లు ఎప్పుడు ఎండిపోలే. ఈ యేడు ఎండాకాలంలో నీళ్లు లేకపోవడంతో పామాయిల్ మొక్కలను జేసీబీతో తీసేశా. వర్షాలు సమృద్ధిగా పడి చెరువులు, కుంటలు, మత్తడి వాగు ప్రాజెక్టు నిండితే సాగు చేస్తున్న పంట చేతికొస్తది. లేదంటే ఈ యేడు పెట్టుబడి కూడా రావడం కష్టమే.

- నవనీత్‌రెడ్డి, రైతు, వడ్డాడి, తాంసి మండలం

# రుణమాఫీ పరేషాన్

- రేషన్‌కార్డు లింక్‌పై రైతుల అసహనం
- షరతులు విధించొద్దంటూ అన్నదాతల డిమాండ్



మంచిర్యాల, జూలై 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పంట రుణమాఫీపై రైతులు పరేషాన్ అవుతున్నారు. రేషన్ కార్డు ఆధారంగా రూ.2లక్షల వరకు మాఫీ చేస్తామని చెప్పడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిబంధనతో ఒక కుటుంబానికి రెండు లక్షల వరకే రుణమాఫీ జరగనుంది. అర్హులైన రైతులు ఆ కుటుంబంలో ఉన్నప్పటికీ వారు రుణమాఫీకి దూరం కానున్నారు. దీంతో రేషన్ కార్డులు లేని రైతులు ఆందోళన చెందుతున్నారు. బంగారాన్ని తాకట్టు పెట్టి పంట రుణం తీసుకున్న రైతులకు కేసీఆర్ ప్రభుత్వం పంట రుణం కిందనే పరిగణించి మాఫీ చేసింది. బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలకు మాఫీ వర్తించదని కాంగ్రెస్ సర్కారు చెప్పడంపై రైతులు పెదవి విరుస్తున్నారు.

### ఆంక్షల రుణమాఫీపై కన్నెర్ర

ఎన్నికల ముందు రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ అని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు విధించి పథకాన్ని వర్తింపజేయకపోవడంపై రైతులు కన్నెర్ర చేస్తున్నారు.అడ్డగోలు ఆంక్షలు పెట్టి రుణ మాఫీ చేయకుండా ఎగ్గొట్టాలని చూస్తున్నదని రైతులు వాపోతున్నారు. కుటుంబాన్ని గుర్తించేందుకు రేషన్ కార్డును లింక్ చేయడం, పీఎం కిసాన్ నిబంధనలు వర్తింపజేస్తామని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. ఆగస్టు 15లోగా రైతులకు రుణమాఫీ చేస్తామని సీఎం చెప్పగా సంతోషించిన రైతులు ఇప్పుడు అడ్డగోలు షరతులు విధించడంతో పట్టరాని కోపంతో ఉన్నారు. రుణమాఫీ చేయకుండా ఎగ్గొట్టి ఆర్థిక భారం తగ్గించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని తప్ప అన్నదాతలకు న్యాయం చేయాలనే ఆలోచన లేదని రైతులు వాపోతున్నారు.

### ఎలాంటి షరతులు లేకుండా చూడాలి..



నెన్నెల, జూలై 16 : కాంగ్రెస్ పార్టీ రూ.2 లక్షలు ఇస్తామని చెప్పి ఇప్పుడు షరతులు విధించవద్దు. రోజుకో మాట చెప్పడంతో రైతుల్లో ఆందోళన కలుగుతున్నది. రుణమాఫీ కోసం ఎంతో మంది రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. అప్పుడు ఇప్పుడు అని రైతులను ఆగం చేస్తున్నరు. చివరకు ఇచ్చే టైములో లేని పోని షరతులు పెడుతున్నరు. రేషన్ కార్డు ఉంటేనే అని ఒక సారి లేకున్నా ఇస్తామని ఒక సారి చెబుతున్నారు. చెప్పే వారికి క్లారిటీ లేక పోతే ఇక రైతులకు రుణ మాఫీపై ఎలా నమ్మకం కలుగుతుంది. ప్రతి రైతుకూ రుణ మాఫీ చేయాలి.

-పంజాల సాగర్‌గౌడ్, ఘన్‌పూర్, నెన్నెల మండలం

### అందరికీ మాఫీ చేయాలి..



పంట రుణం తీసుకున్న అందరికీ రుణ మాఫీ చేయాలి. రోజుకో మాట , పూటకో జీవోలతో రైతులను ఆగం చేయద్దు. రైతులు రుణం తీసుకున్నట్లు బ్యాంకుల్లో లెక్కలు ఉంటాయి కదా ఇంకేం కావాలి. పదేండ్లుగా మాకు రేషన్ కార్డులేదు. మా లాంటి రైతులకు రుణ మాఫీ చేయరా ? మేము రైతులం కాదా ? షరతులు పెట్టి మమ్ముల్ని ఇబ్బంది పెట్టద్దు. రెండు లక్షలు మాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు కొర్రిలు పెడుతుండ్రు. అప్పుడే చెప్పి ఉంటే మా దారి మేము చూసుకునేటోళ్లం కదా.. రుణ మాఫీ లేదు. రైతు బంధు లేదు ఇలా ఎన్ని రోజులు నాన్చుతరో మరి .

-గన్న అంజన్న, నెన్నెల

### రైతులను మోసం చేసే కుట్ర..



కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీపై అడ్డగోలు ఆంక్షలు విధించి రైతులకు అందించే రుణమాఫీని ఎగ్గొంటేందుకుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నది. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ప్రతి రైతుకూ రుణ మాఫీ చేయాలి. రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని చెప్పిన కాంగ్రెస్ పార్టీ రైతులను నిబంధనల పేరిట ఇబ్బందులు పెట్టకుండా ప్రతి ఒక్కరికీ ఈ మాఫీ వర్తింపజేయాలి.

-మారిశెట్టి మల్లయ్య, రాంపూర్, కోటపల్లి

### భారం తగ్గించుకునేందుకే..



ఎన్నికల ముందు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీ చేయకుండా అడ్డగోలు నిబంధనలు పెట్టి భారం తగ్గించుకోవాలని చూస్తున్నది. అర్హులైన ప్రతి రైతుకూ ప్రభుత్వం చెప్పినట్లుగా ఆగస్టు 15లోగా రుణమాఫీ చేయాలి. రుణమాఫీపై అడ్డగోలు నిబంధనలు పెట్టడం ద్వారా రైతులు నష్టపోయే అవకాశం ఉంది.

-రాళ్లబండి శ్యామ్‌సుందర్, కోటపల్లి

### రేషన్ కార్డులతో రుణమాఫీకి లింక్ పెట్టవద్దు..



రేషన్ కార్డులతో రుణమాఫీకి లింక్ పెట్టకుండా రుణమాఫీ చేయాలి. ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు రైతులు ఉంటే ఈ విధానం ద్వారా రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటే ఇలాంటి విషయాల్లో నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సర్వే చేసి రైతులను గుర్తించి రుణమాఫీ చేయడం ద్వారా పేద రైతులకు ప్రయోజనం ఉంటుంది.

-రాళ్లబండి శ్రీనివాస్, కోటపల్లి



సమావేశంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

## సచివాలయంలో సీఎం సమీక్ష

హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళ వారం సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో ధరణి సమస్యలు, ఖరీఫ్, ప్రజారోగ్యం, సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్య, లా అండ్ ఆర్డర్, డ్రగ్స్ నిర్మూలనపై చర్చించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

- నమస్తే నెట్‌వర్క్, జూలై 16

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679